వాయిస్ అఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
TGTEL/25/A2649
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
శుక్రవారం, డిసెంబరు 26, 2025
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## సంక్రాంతికి ఆరు ప్రత్యేక సర్వీసులు ప్రకటించిన రైల్వే



సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక ప్రకటన చేసింది. ప్రయాణికుల సౌకర్యార్థం కాకినాడ, సికింద్రాబాద్ మీదుగా వికారాబాద్, నాందేడ్ మార్గాలలో, అలాగే మచిలీపట్నం మార్గంలో మొత్తం ఆరు ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే నిర్ణయించింది. ఈ ప్రత్యేక సర్వీసులలో రెండు రైళ్లు కాకినాడ నుంచి సికింద్రాబాద్ మీదుగా వికారాబాద్ వరకు నడుస్తాయి. మరో రెండు రైళ్లు నాందేడ్ - కాకినాడ మార్గంలో, మిగిలిన రెండు రైళ్లు మచిలీపట్నం - వికారాబాద్ మధ్య సేవలు అందిస్తాయి.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం, 9 మంది మృతి..

- తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం..
- టైర్ పేలి కార్‌లను ఢీకొట్టిన బస్సు..
- 9 మంది మృతి, పలువురికి గాయాలు..




2లో



## కర్ణాటకలో ఘోర ప్రమాదం. 17 మంది సజీవ దహనం

- కర్ణాటకలో ఘోర ప్రమాదం
- ప్రైవేటు ట్రావెల్ బస్సును ఢీకొట్టిన లారీ
- 17 మంది ప్రయాణికులు సజీవ దహనం

# పాక హన్మంతు ఎన్‌కౌంటర్

- నేలకొరిగిన మావోయిస్టు కీలక నేత
- ఒడిశా రాష్ట్రం కంధమల్ జిల్లా అడవుల్లో భీకర ఎదురుకాల్పులు
- హన్మంతు సహా నలుగురి మృతి ఆయనపై రూ.1.1 కోట్ల రివార్డు
- స్వస్థలం చండూరు మండలం పుల్లెంల

నల్లగొండ: ఒడిశా రాష్ట్రం కంధమల్ జిల్లా అడవుల్లో బుధవారం చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో నల్లగొండ జిల్లాకు చెందిన మావోయిస్టు సీనియర్ నేత, కేంద్ర కమిటీ సభ్యుడు హన్మంతు అలియాస్ గణేశ్ ఉయికే(69) మృతిచెందారు. కంధమల్-గంజామ్ జిల్లాల సరిహద్దు చకపాడా సమీపంలోని రంభా ఫారెస్ట్ రేంజ్ పరిధిలో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో హన్మంతుతోపాటు మరో ముగ్గురు మావోయిస్టులు కూడా ప్రాణాలు కోల్పోయారు.





2లో




## ఏపీ వ్యవసాయానికి
# చేయూతనివ్వండి

- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- విభజన హామీ మేరకు కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని వినతి
- కొబ్బరి పార్క్, ఆక్వా ల్యాబ్, మ్యాంగో బోర్డు ఏర్పాటుకు సహకరించాలన్న సీఎం
- సూక్ష్మ సేద్యం విస్తరణకు రూ.695 కోట్లు కేటాయించాలని డిమాండ్

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అమరావతి పర్యటనలో భాగంగా తనను కలిసిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని చంద్రబాబు బలంగా కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు వివరించారు. పంచ

- మిగతా 2వ పేజీలో



## మళ్లీ గెలుస్తానని శపథాలా?

- కొడంగల్‌లో ఓడినప్పుడు చేసిన రాజకీయ సన్యాసం ఏమైంది?
- చిల్లర మాటలు మానుకో
- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

సిద్దిపేట జోన్: ‘వయసులో నీకు తండ్రి లాంటి వారైన కేసీఆర్‌పై మాట్లాడిన మాటలు ఏమిటి? టైమ్ వస్తది బిడ్డా! నీవేదో వీర్ర వీగుతు న్నావు, అహంకారంతో మాట్లాడుతున్నావు. ఇప్పటి కైనా చిల్లర మాటలు మానుకో’ అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అనాథ పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టక, కాస్మెటిక్ చార్జీలు ఇవ్వడం చేతకాక దుర్భాషలాడటం తగునా అని ప్రశ్నించారు. అలాంటి రేవంత్‌రెడ్డిని కొరడా దెబ్బలు కొట్టినా తక్కువేనంటూ మండిపడ్డారు.

2లో

# ఏపీ హైకోర్టులో టీటీడీకి భారీ ఊరట

- స్వర హెూటల్‌కు భూ కేటాయింపుపై హైకోర్టులో పిల్
- స్వర హెూటల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం చట్ట విరుద్ధమన్న పిటిషనర్
- భూమార్పిడి ఒప్పందాన్ని రద్దు చేయలేమన్న ఉన్నత న్యాయస్థానం
- పిల్ ను కొట్టేసిన హైకోర్టు



# క్రిస్మస్ వేడుకలలో వైఎస్ జగన్

- కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు
- నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

పులివెందుల: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా పులివెందులలోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడికి హాజరైన వారిని ఆప్యాయంగా, చిరునవ్వుతో పలకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలలో వైఎస్ జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా



2లో

## కేసీఆర్‌కు కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు లేదు!

- కేసీఆర్‌కు కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు లేదు
- కాళేశ్వరం దృష్టి మళ్లించడానికి కృష్ణా జలాల అంశం
- సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష కరెక్ట్ కాదు

ఫోన్ ట్యాపింగ్ కేసు..
## నేటితో ముగియనున్న ప్రభాకర్ రావు విచారణ!

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇవాళ్టితో ముగియనున్న ప్రభాకర్ రావు విచారణ
- సుప్రీంకోర్టు ఆదేశాలతో రెండు వారాల పాటు ప్రభాకర్ రావును విచారిస్తున్న సిట్
- ప్రభాకర్ రావు నుంచి కీలక సమాచారం రాబట్టిన సిట్
- రాజకీయ నేతల పాత్రపై ఆధారాలు సేకరించిన సిట్

2లో

వాయిస్ టుడే
జనగాత్రం - మునినేత్రం
శుక్రవారం, డిసెంబరు 26, 2025

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం, 9 మంది మృతి..

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కడలూరు జిల్లా తిట్టకుడి సమీపంలోని తిరుచి చెన్నై జాతీయ రహదారిలో ఈ ప్రమాదం జరిగింది. తిరుచిరాపల్లి నుంచి చెన్నైకి వెళ్తున్న తమిళనాడు ప్రభుత్వ ఆర్టీసీ బస్సు ముందు టైర్లు పంచర్ అవ్వడంతో అదుపుతప్పి, అవతల వైపు జాతీయ రహదారిపై వస్తున్న రెండు కార్లపైకి దూసుకు వెళ్ళింది. అత్యంత వేగంగా రెండు కార్లను ఢీకొట్టింది. కార్‌లలో ప్రయాణిస్తున్న 9 మంది మృతి చెందారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు గాయాలు కావడంతో సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వారిని తరలించారు. పోలీసులు కారులో చిక్కుకుపోయిన వారిని బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంతో చెన్నై తిరుచి జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. అత్యంత వేగంగా వెళుతున్న బస్సు టైరు పంచర్ అవ్వడంతో డివైడర్ ఢీ కొట్టి అవతల వైపు రోడ్డులో వస్తున్న కారులను ఢీ కొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## ఏపీ వ్యవసాయానికి చేయూతనివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

సూత్రాల ప్రణాళికతో వ్యవసాయంలో 10.70 శాతం వృద్ధి సాధించామని తెలిపారు. నీటి భద్రత, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ రంగం బలోపేతానికి సీఎం చంద్రబాబు పలు కీలక ప్రతిపాదనలను కేంద్ర మంత్రి ముందుంచారు. పీఎం కృషి సిచాయి యోజన కింద సూక్ష్మ సాగునీటి విస్తరణకు అదనంగా రూ.695 కోట్లు కేటాయించాలని కోరారు. రూ.200 కోట్ల అంచనాతో కొబ్బరి పార్క్, అత్యాధునిక ఆక్వా ల్యాబ్, రాష్ట్రంలో మామిడి రైతుల కోసం ప్రత్యేకంగా మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు ఏపీని సహజ సాగుకు 'జాతీయ వనరుల రాష్ట్రం'గా ప్రకటించాలని, రాబోయే ఐదేళ్లలో 20,000 అదనపు సహజ సాగు క్లస్టర్లను మంజూరు చేయాలని కోరారు. పులికాట్ సరస్సు అభివృద్ధికి నిధులు, ఆహార శుద్ధి ఇంక్యుబేషన్ సెంటర్లు, పొగాకు సేకరణకు ఆర్థిక సాయం వంటి అనేక అంశాలను వినతిపత్రంలో పొందుపరిచారు.

## పాక హన్మంతు ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

హన్మంతు స్వస్థలం నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామం. ఆయనపై రూ.1.1 కోట్ల రివార్డు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. పాక పాపమ్మ-చంద్రయ్య దంపతులకు 1961లో హన్మంతు జన్మించారు. ఆయనకు ముగ్గురు చెల్లెండ్లు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో పుల్లెంలలో ఆయన పుట్టిన ఇల్లు పడావు పడింది. ఆయన ఒక సోదరుడు నల్లగొండలో నివాసం ఉంటుండగా సోదరీమణులు హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. హన్మంతు నల్లగొండలోని నాగార్జున డిగ్రీ కాలేజీలో డిగ్రీ బీఎస్సీ కోర్సు చదివారు. డిగ్రీ రెండవ సంవత్సరంలో ఉండగానే మావోయిస్టు ఉద్యమం వైపు ఆకర్షితుడై పార్టీలో పూర్తి కాలం కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించారు. 1982లో బీఎస్సీ రెండవ సంవత్సరం చదువుతుండగా రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) అధ్యక్షుడిగా పనిచేశారు. అదే సమయంలో కాలేజీలో ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నేతలతో జరిగిన విద్యార్థి సంఘాల గొడవల్లో హన్మంతు కీలక పాత్ర వహించినట్లు తెలిసింది. ఈ క్రమంలో 1980లో నల్లగొండలో జరిగిన ఏబీవీపీ నేత ఏచూరి శ్రీనివాస హత్య కేసులో నిందితుడిగా ఉన్నారు. అప్పటినుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయి అప్పటి పీపుల్స్‌వార్ ఉద్యమంలో చేరి వెనుదిరిగి చూడలేదు. మావోయిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ జిల్లా, రాష్ట్ర స్థాయి నేతగా పేరొందారు. నాలుగున్నర దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో ఎన్నో ప్రధాన ఘట్టాల్లో కీలక పాత్ర పోషించారు.

## క్రిస్మస్ వేడుకలలో వైఎస్ జగన్

(మొదటి పేజీ తరువాయి)

మాజీ సీఎం వైఎస్ జగన్ ఇక్కడికి విచ్చేసిన బంధువర్గానికి, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు క్రిస్మస్ పర్వదినం, ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఏటా క్రిస్మస్ పర్వదినం రోజున నా సొంత గడ్డపై కుటుంబ సభ్యులు, బంధుగణం, స్నేహితులతో కలిసి పండుగలో పాల్గొనడం మనసుకు ఆనందాన్ని ఇచ్చింది. మీ అందరి అభిమానం, ఆశీస్సులు, దేవుని చల్లని దీవెనలు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. అనంతరం వైఎస్ జగన్ తన మాతృమూర్తి వైఎస్ విజయమ్మ, కుటుంబ సభ్యులు, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పారిశ్రామికవేత్త వైఎస్ ప్రకాష్ రెడ్డి, దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, చర్చి ఫాదర్లు రెవరెండ్ డాక్టర్ థామస్ ప్రసాదరావుబాబు, నరేష్ బాబు, మృత్యుంజయరావులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. 2026 నూతన సంవత్సర చర్చి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చిలో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాథరెడ్డి, డాక్టర్ సుధ, మాజీ మంత్రి అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మాజీ మేయర్ సురేష్, కడప మేయర్ పాకా సురేష్, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, వైఎస్ జోసఫ్‌రెడ్డి పాల్గొన్నారు.



## కేసీఆర్‌కు కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు లేదు!

కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు మాజీ సీఎం కేసీఆర్‌కు లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దృష్టి మళ్లించడానికి కృష్ణా జలాల అంశం కేసీఆర్ లేవనెత్తుతున్నారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా తానే అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టించా అని చెప్పారు. ఇక కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని బండి సంజయ్ తప్పుబట్టారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్ మాట్లాడిని భాష సరికాదన్నారు. ఈరోజు మీడియా చిట్‌చాట్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ పలు విషయాలపై స్పందించారు. 'కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష కరెక్ట్ కాదు. మనం మాట్లాడే భాష ఎదుటి వ్యక్తులను కించపరిచే విధంగా ఉండకూడదు. సీఎం తన భాషపై పునరాలోచన చేయాలి. ప్రతీ వ్యక్తి సుఖ సంతోషాలతో ఉండాలని హిందూ ధర్మం కోరుకుంటుంది. కేసీఆర్ కుమారుడు అహంకారం తలకెకినట్టు మాట్లాడుతారు. గతంలో కేసీఆర్ మాట్లాడితే మేము ఖండించాం. సీఎం రేవంత్ మాట్లాడిన తీరు ఆయనకే నష్టం' అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు.

'తెలంగాణకు నంబర్ వన్ ద్రోహి కేసీఆర్. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ ఏమీ చేశారో ఆధారాలతో సహా బయట పెట్టింది ముందు నేనే. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకున్నారు. ముడుపుల కోసం 575 టీఎంసీలు అడగలేదు. కేసీఆర్‌కు కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు లేదు. అప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా నేనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టించాను. కాళేశ్వరం స్కాం నుంచి దృష్టి మరల్చేందుకు కేసీఆర్ కృష్ణ జలాలు ఇష్యూ తెరపైకి తెస్తున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్, కేసీఆర్ మధ్య ఏం ఒప్పందం జరిగిందో చెప్పాలి. కేసీఆర్ కుటుంబమే తెలంగాణకు పెద్ద శని. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం



## కర్ణాటకలో ఘోర ప్రమాదం. 17 మంది సజీవ దహనం

క్రిస్మస్ పండగ వేళ కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగినట్టుగానే కర్ణాటకలో కూడా పెను విషాదం చోటుచేసుకుంది. బెంగళూరు నుంచి గోకర్ణ వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సును లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రయాణికులు తేరుకునేలోపే మంటలు చుట్టుముట్టేశాయి. దీంతో 17 మంది ప్రయాణికులు సజీదహనం అయినట్లుగా తెలుస్తోంది. గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఈ ఘోరం జరిగింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రస్తుతం సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. పండగ వేళ ఘోర ప్రమాదం జరగడంతో బంధువులు, కుటుంబ సభ్యులు పెను విషాదంలో మునిగిపోయారు. బస్సులో మొత్తం 32 మంది ప్రయాణికులు ఉన్నారని తెలుస్తోంది. 9 మంది క్షేమంగా బయటపడినట్లు సమాచారం. హిరియూర్‌లో గొర్లట్టు దగ్గర ట్రక్కు-బస్సు ఢీకొన్నాయి. ఢీకొట్టగానే బస్సు-లారీలో మంటలు చెలరేగాయి. రెండు కూడా మంటల్లో కాలిపోయాయి. బస్సు గోకర్ణ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రయాణికులంతా గోకర్ణకు చెందిన వారిగా వార్తలు వినిపిస్తున్నాయి.



## ఫోన్ ట్యాపింగ్ కేసు.. నేటితో ముగియనున్న ప్రభాకర్ రావు విచారణ!

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణ ఇవాళ్టితో ముగియనుంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో రెండు వారాల పాటు ప్రభాకర్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) బృందం విచారిస్తోంది. డిసెంబర్ 26వ తేదీన ప్రభాకర్ రావును విడిచి పెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రెండో వారం విచారణలో ప్రభాకర్ రావు నుంచి సిట్ బృందం కీలక సమాచారం రాబట్టింది. మొదట విచారణకు సహకరించని ప్రభాకర్ రావు.. పూర్తి ఆధారాలు ముందు ఉంచడంతో కొన్నిటికి సమాధానాలు చెప్పినట్టు సమాచారం. ప్రభాకర్ రావు తన పై అధికారుల పేర్లు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారట. ఫోన్ టాపింగ్ కేసులో అరెస్ట్ అయిన నిందితులంతా ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే నెంబర్లను టాపింగ్ చేశామని స్టేట్‌మెంట్ ఇచ్చారు. ట్యాపింగ్ చేసిన సమాచారం ప్రభాకర్ రావు పై వారికి ఏ విధంగా చేరవేశాడని దానిపైనే సిట్ దర్యాప్తు చేస్తోంది. టాపింగ్ కేసులో ఒక పెన్ డ్రైవ్ కీలక ఆధారంగా మారింది. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా పనిచేసిన టైంలో పెన్ డ్రైవ్లో టాపింగ్ వివరాలు స్టోర్ చేశారట. రెండు వారాల విచారణకు సంబంధించిన రిపోర్ట్ ను సుప్రీంకోర్టుకు అందించనున్న సిట్ బృందం. జనవరి 16న ప్రభాకర్ రావు బెయిల్ పిటిషన్తో పాటు ఫోన్ టాపింగ్ కేసులో సుప్రీంకోర్టు విచారణ జరపనుంది. ఇక రేపటి నుంచి సిట్ ఏం చేయబోతుందనేదే ఉత్కంఠగా మారింది. ఫోన్ టాపింగ్లో రాజకీయ నాయకుల పాత్రపై సిట్ బృందం ఆధారాలు సేకరించింది.

## ఏపీ హైకోర్టులో టీటీడీకి భారీ ఊరట

తిరుపతి మండలం పేరూరు గ్రామ పరిధిలో టీటీడీకి చెందిన భూమిని పరస్పర భూమార్పిడి విధానంలో పర్యాటక శాఖకు కేటాయించి, అనంతరం దానిని ఒబెరాయ్ గ్రూప్‌కు చెందిన 'స్వర' హెూటల్ నిర్మాణానికి ఇచ్చిన వ్యవహారంలో హైకోర్టు జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఈ మేరకు దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది. టీటీడీ – పర్యాటక శాఖ మధ్య జరిగిన భూమార్పిడిని రద్దు చేయాలని, స్వర హెూటల్స్‌కు భూమి కేటాయింపుపై జారీ చేసిన జీవోను సవాలు చేస్తూ తిరు క్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ టీటీడీ నుంచి పర్యాటక శాఖ తీసుకున్న భూమిలో స్వర్ణ హెూటల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, భక్తుల కోసం చేపట్టాల్సిన ప్రాజెక్ట్‌ను టీటీడీ వేరే ప్రాంతానికి మార్చిందన్న కారణంతో మాత్రమే భూమార్పిడి ఒప్పందాన్ని రద్దు చేయలేమని స్పష్టం చేస్తూ పిల్‌ను తోసిపుచ్చింది. దీంతో టీటీడీకి హైకోర్టులో భారీ ఊరట లభించినట్లయింది.





## మళ్లీ గెలుస్తానని శపథాలా?

(మొదటి పేజీ తరువాయి)

గురువారం క్రిస్మస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ బ్రిడ్జి స్కూల్‌ను హరీశ్‌రావు సందర్శించారు. వారి యో గక్షేమాలు అరా తీసి పిల్లలతో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'మాట లు సీఎంకే కాదు.. మాకూ వస్తాయి. తెలంగాణకు జరుగుతున్న నీటి అన్యాయం, కాంగ్రెస్ ఎన్నికల హామీల గురించి కేసీఆర్ మాట్లాడితే సీఎం స్థాయి మరచి రేవంత్‌రెడ్డి బూతులు మాట్లాడటం ఏమిటి? మళ్లీ గెలుస్తా, టూ థర్డ్స్ మెజారిటీతో గెలుస్తా అని శపథాలు చేస్తున్న రేవంత్‌రెడ్డి.. కొడంగల్ ఎన్నికల్లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చేసిన శపథం ఏమైంది? రేవంత్‌రెడ్డికి మాటతప్పడం, పార్టీలు మారడం, పదవులు కొనుక్కోవడం, చిల్లర మాటలు మాట్లాడటం బాగా అలవాటే' అంటూ హరీశ్‌రావు మండిపడ్డారు. ఫార్మాసిటీని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని కేసీఆర్ అడగడం తప్పా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. గతంలో ఫార్మాసిటీ భూములు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్.. ప్రస్తుతం చేస్తున్న పని ఏమిటని నిలదీశారు. కేసీఆర్ ఆలోచన మేరకు ఫార్మాసిటీని ఏర్పాటు చేయకుంటే రైతులకు భూములు తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. ఐదు నెలలుగా కాస్మెటిక్ చార్జీలు, మెస్ చార్జీలు అందక అనాథ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, సీఎం ఇప్పటికైనా బిల్లులు విడుదల చేయాలన్నారు.



# కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం
# నూతన ఆంగ్ల సంవత్సరం కాలమాన క్యాలెండర్ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 25 (వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని టీఐసీసీ కాలనీ నల్ల పోచమ్మ టెంపుల్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నూతన ఆంగ్ల సంవత్సరం కాలమాన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించి, మున్నూరు కాపు సమాజ బంధువులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ అభివృద్ధికి సంఘాలు ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పటేల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పాల్గొని మాట్లాడుతూ, మున్నూరు కాపు సమాజం సామాజిక, రాజకీయ, విద్యా రంగాల్లో మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరు కాపు సంఘాల బలోపేతం కోసం తాను నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాచిగూడ మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వరరావు అడ్వకేట్ మాట్లాడుతూ, సమాజానికి ఐక్యతే అసలైన బలం అని, యువత విద్య, ఉద్యోగాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబానికి శాంతి, అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. అలాగే శంబిపూర్ కృష్ణ మంత్రి సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బూరుగు లక్ష్మీనారాయణ, ముఖ్య సలహాదారులు బూరుగు బావి హనుమంతరావు, సగిడి కృష్ణ మేడ్చల్ జిల్లా కన్వీనర్ పుప్పాల భాస్కర్, హరికిరణ్ పటేల్, డివిజన్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మున్నూరు కాపు బంధుమిత్రులు హాజరై నూతన ఆంగ్ల సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## దేవేందర్ నగర్లో బస్తీ దావకాన మరియు బస్సు షెల్టర్ ఏర్పాటుకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు వినతి



కుత్బుల్లాపూర్ డిసెంబర్ 25(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం లోని దేవేందర్ నగర్ జేఏసీ ఆధ్వర్యంలో కమిటీ వారు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ షాపూర్ నగర్ లోని తన నివాసం వద్ద కలిసి దేవేందర్ నగర్లో బస్తీ దావకాన మరియు బస్సు షెల్టర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయవలసిందిగా వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దేవేందర్ నగర్ లోని ప్రజలందరూ కాయకష్టం చేస్తూ జీవనం సాగిస్తుంటారని, ఇక్కడ నిరుపేద కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, ఇక్కడ ప్రజలకు అనారోగ్య పరిస్థితులు ఏర్పడితే సరైన హాస్పిటల్ సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అందుచేత మాకు బస్తీ దావకానాను మరియు బస్సు షెల్టర్ ను ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. అలాగే శివ సాయి హిల్స్ వారు మా కాలనీలో స్ట్రాం వాటర్ డ్రైన్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని వర్షాకాలంలో వర్షం నీరు బయటికి వెళ్ళటానికి లేక కాలనీ వీధులన్నీ మునిగిపోయి చాలా ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వారు శ్రీశైలం గౌడ్ తెలపడం జరిగింది.

మరియు వంగవీటి మోహన్ రంగ వర్ధంతి సందర్భంగా ఆహ్వాన పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ దేవేందర్ నగర్ లో బస్తీ దావకాన మరియు బస్ షెల్టర్ కు సంబంధించి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మల్లేష్, పూలమ్మ, డాన్ శీను, సాయిబాబా, సంధ్యారెడ్డి, ప్రసాద్ రెడ్డి, లక్ష్మి, గణపతి, భాస్కర్, శ్రీనివాస్, నాగేష్, జహంగీర్ మరియు జేఏసీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## రామంతపూర్‌లో ఘనంగా జరిగిన క్రిస్మస్
### వేడుకల్లో పాల్గొన్న ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):– రామాంతాపూర్ చర్చి కాలనీ లో లుద్ మాత చర్చి లో క్రిస్మస్ వేడుకలు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మందముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. చర్చి కాలనీ సభ్యులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసిన పరమేశ్వర్ రెడ్డి,కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డిలు,ఈ సందర్భంగా సంయుక్తంగా మాట్లాడుతూ అందరికి ముందుగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

శత్రువుల పట్ల క్షమాగుణం కలిగి ఉండాలని యేసుక్రీస్తు సందేశం ఇచ్చారు అని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో ఆనంద్ ,జానీ,సుధాకర్, సతీష్, డేవిడ్, రత్న రెడ్డి,లక్ష్మా రెడ్డి,ప్రవీణ్ కుమార్, వాళ్ళపు శ్రీకాంత్ యాదవ్,ఉపేందర్ రెడ్డి,సందీప్,భాస్కర్,భాస్కర్, వినయ్, కిరణ్, రాజు, రమ్మన, ఆరోగ్యమ్మ, సుమలత ,బాబు రావు,శ్రీనివాస్,ఇన్నాశమ్మ, మేరీ, లూద్ రెడ్డి, రోజీ మేరీ, జయశీలం, జోసెఫ్. పెద్ద ఎత్తున క్రిస్టియన్ సహోదరులు మరియు డివిజన్ నాయకులు పాల్గొన్నారు. ం

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):– ఉప్పల్ డివిజన్ పరిధిలోని చేర్చి కాలని లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రతి మానవుడిలో ప్రేమ ,క్షమగుణం పెంపొందాలి అనే క్రీస్తు ఆలోచన విధానం నిత్యం ఆచరణనియం అని ఆయన చెప్పారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఆయన తెలిపారు. విశ్వ మానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు నింపిన కరుణమయుడని అన్నారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తన రక్తం చిందించిన ధీశాలి యేసుక్రీస్తు ప్రభువు అన్నారు. యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రిస్మస్ పర్వదినాన్ని ఉప్పల్ ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

# ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఘనంగా సత్కరించిన అయ్యగారిపల్లి ప్రముఖులు





హైదరాబాద్, డిసెంబర్ 25 (వాయిస్ టుడే): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖులు ఘనంగా సత్కరించారు. అయ్యగారిపల్లి గ్రామ పంచాయతీకి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మలిశెట్టి శోభన్, ఉప సర్పంచ్ కొణతం జ్యోతి వెంకన్నతో పాటు గ్రామ ప్రముఖులు గురువారం హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మామిడి శోభన్ బాబు, కేసముద్రం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్, మాజీ ఎంపీటీసీ మాలోత్ మంగ్యానాయక్, మున్నూరు కాపు సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు మలిశెట్టి రవి తదితరులు కలిసి ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఎంపీని కలిసిన వారిలో వార్డు సభ్యులు మామిడి కిరణ్, బానోతు సంజీవ, స్వరూప, మాలోతు జ్యోతి, భద్రు, నూనావత్ యాకూబ్లతో పాటు బొల్లు సంపత్, మలిశెట్టి శివరాజ్, మామిడి విష్ణు, మద్దికుంట్ల సుమన్, గుండ్ల శరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అయ్యగారిపల్లి గ్రామ పంచాయతీకి నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శాలువాలు కప్పి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సి.ఎన్. రెడ్డి



జూబ్లీహిల్స్ 25 డిసెంబర్( వాయిస్ టుడే) రహమత్ నగర్: శ్రీరామ్ నగర్ మరియు బ్రహ్మ శంకర్ నగర్ కాలనీలలో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీరామ్ నగర్‌లో పాస్టర్ సుధాకర్ గారి ఆధ్వర్యంలో, బ్రహ్మ శంకర్ నగర్‌లో పాస్టర్ సురేష్ బాబు గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలలో కార్పొరేటర్ సి.ఎన్. రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు బోధనలు మానవాళికి ఆదర్శమని, ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో పయనించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



## క్రిస్మస్ వేడుకలకు హాజరైన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్ డిసెంబర్25(వాయిస్ టుడే): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని చర్చ్ గాగిల్లాపూర్ లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జయ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని సీనియర్ నాయకులు జయ రాజ్ కుటుంబసభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మరో కార్యక్రమంలో... బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో చర్చ్ గాగిల్లాపూర్ లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై సీనియర్ నాయకులు రంజిత్ రెడ్డికి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శంభీపూర్ కృష్ణ, మాజీ కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, జక్కుల శ్రీనివాస్ యాదవ్, మాజీ మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రవి యాదవ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## భారత రత్న, మాజీ ప్రధాని, స్వర్గీయ అటల్ బిహారి వాజ్‌పేయ్ శత జయంతి వేడుకలు

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 25(వాయిస్ టుడే): 132 డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ %–% చత్రపతి శివాజీ సర్కిల్ వద్ద వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవ కార్యక్రమం ఘనంగా, భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తల పాల్గొనడంతో నిర్వహించబడింది. ఈ సందర్భంగా వాజ్‌పేయ్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి, వారి దేశభక్తి, ప్రజాస్వామ్య విలువలు, సుసంపన్నమైన భారతదేశ నిర్మాణంలో చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. వాజ్‌పేయ్ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాకుండా, కవి, వక్త, దార్శనికుడు అని, దేశ ఐక్యత, సమగ్ర అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, జిల్లా పదాధికారులు నల్ల జై శంకర్ గౌడ్, పులి బలరాం, వేముల రమేష్, నటరాజ్ గౌడ్, శ్యామ్ కిరణ్ రెడ్డి, అలాగే బీజేపీ సీనియర్ నాయకులు కీర్తి శ్రీనివాస్, మనీష్, దమ్మని యశ్వంత్, శివ, సతీష్ చక్రవర్తి, ప్రసాద్ శర్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ, అటల్ బిహారి వాజ్‌పేయ్ ఆశయాలను ప్రతి కార్యకర్త మనస్ఫూర్తిగా ఆచరించాలని, దేశ సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ శత జయంతి ఉత్సవాలు యువతలో దేశభక్తి, జాతీయ భావజాలాన్ని మరింత బలపరిచేలా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, చివరగా వాజ్‌పేయ్ గ ఆశయాలను కొనసాగించేందుకు అందరూ కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు.



## ఘనంగా భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 25( వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పద్మానగర్ ఫేజ్%–%2లో భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరివర్ధన్ రెడ్డి హాజరై, వాజ్‌పేయి దేశసేవను స్మరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు బీఎంఎస్ యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
శుక్రవారం 26 డిసెంబరు 2025



## ఉచిత వైద్య సేవలతో పాటు ప్రజా సమస్యలే ముఖ్యం బి కే ఆర్

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 25(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ గండి మైసమ్మ 294 సర్కిల్ సాయి పూజ కాలనీలో బి కే ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 16వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ అధ్యక్షులు కిషోర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరం ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్యంతో పాటు బస్తీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడమే నా లక్ష్యం త్వరలో బస్తి బాట పేరుతో నేరుగా ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు బస్తీలు పర్యటించడం జరుగుతుంది ఆరోగ్యంతో పాటు అభివృద్ధి కూడా ముఖ్యమని తెలియజేశారు బి కే ఆర్ ఫౌండేషన్ కు సహకరిస్తున్న హాస్పటల్ యజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ కావలి గణేష్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఫాతిమా భాస్కర్ కాసిం భాయ్ మూసిం భాయి గజేంద్ర మరియు కాలనీ ప్రజలు పాల్గొనడం జరిగింది.



## జనవరి 4న పటాన్ చెరులో ఆల్ ఇండియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీలు

### పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానం వేదికగా జనవరి 4వ తేదీన జిఎంఆర్ ఆల్ ఇండియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో పోటీలకు సంబంధించిన బ్రోచర్ ను ఎమ్మెల్యే జిఎంఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి తరం యువతను ప్రోత్సహించేలా ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరిలో వ్యాయామంపై ఆసక్తి పెంపొందించేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. యువత పెడదారి పట్టకుండా క్రీడలపైన ఆసక్తి పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు నియోజకవర్గంలో మొట్టమొదటిసారి జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనబోతున్నారని తెలిపారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## స్థానిక కాంగ్రెస్ నేతకే మణికేశ్వర్ నగర్ టికెట్ ఇవ్వాలి

అదం సంతోష్ కుమార్‌ని శాలువతో సత్కరిస్తున్న మణికేశ్వర్ నగర్ వాసులు

సికింద్రాబాద్ (వాయిస్ టుడే):సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని మణికేశ్వర్ నగర ప్రాంతవాసులు, రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకుడికి టికెట్ కేటాయించాలని కంటెస్టెడ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ అదం సంతోష్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు. గత 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా కొనసాగుతూ, పార్టీ బలోపేతానికి ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన వార్డుల పునర్విభజనలో భాగంగా మణికేశ్వర్ నగరాన్ని తార్నాక డివిజన్ నుంచి సీతాఫలమండి డివిజన్‌లో కలపడం జరిగిందని, అయినప్పటికీ ఈ ప్రాంతానికి ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యత ఉన్నదని వారు గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉస్మానియా యూనివర్సిటీకి సమీపంలో ఉండటం వల్ల మాణికేశ్వరీ నగర్ ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీ పట్ల పూర్తి విధేయతతో కొనసాగుతూ, అదం సంతోష్ కుమార్ నాయకత్వంలో రానున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో చురుకుగా పాల్గొని పార్టీ విజయానికి కృషి చేస్తామని మాణికేశ్వర్ నగర ప్రజలు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.




## డ్రగ్స్ మహమ్మారిని అంతం చేసేందుకు 'మేము సైతం'

హైదరాబాద్, డిసెంబర్ 25: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వంటి మహమ్మారులను అంతం చేసేందుకు పోలీసులతో కలిసి పనిచేస్తామని బర్కత్ పుర లోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అన్నారు. డ్రగ్స్ ను నిర్మూలించేందుకు తమవంతు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం గుంతపల్లి గ్రామంలో డ్రగ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బేటి బచావో, బేటి పడావో పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసై... జీవితాలు నాశనం చేసుకోవద్దని, చదువుకొని ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ కు అలవాటు పడకుండా యువత జాగ్రత్తగా మెలగాలని అన్నారు. మత్తుకు అలవాటు పడితే జీవితం గాడితప్పుతుందని, భవిష్యత్తు అంధకారమవుతుందని వారు వివరించారు.






## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నాచారం, డిసెంబర్ 25 (వాయిస్ టుడే):కరుణామయుడు ఏసుప్రభు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మెట్టుగూడ విజయపురి కాలనీలోని సౌత్ లాలాగూడ సెంటనరి బాప్టిసస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చి ఎగ్జిక్యూటివ్ కమిటి అధ్యక్షుడు ఎం.క్రిస్టోఫర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెవ.పి.జె.ప్రకాశం, రెవ డి.విల్సన్ పాల్,రెవ ఎం.విద్యాసాగర్లు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గోన్న విద్యార్థులు,మహిళలు క్రీస్తూ ఆరాదనలను స్తుతించారు.ఈ సందర్భంగా చర్చి కమిటీ అధ్యక్షుడు క్రిస్టోఫర్ మాట్లాడుతూ సుమారు వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సెంటనరి బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా వివిద కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. క్రిస్మస్ పండుగా విశ్వమానవ సౌభ్రాతృత్వానికి, ప్రేమకు,శాంతికి ప్రతీక అని పేర్కొన్నారు. విశ్వమానవ ప్రభువైన యేసు క్రీస్తు బోధనలు మన జీవితాలకు మార్గదర్శకాలు అని, ప్రేమ, క్షమా ధర్మాలు మనందరికీ స్ఫూర్తి కలిగించాలన్నారు.ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సెక్రటరీ వరకుమార్ బొజ్జం,వైస్ ప్రెసిడెంట్ బైరపాక ప్రవీణ్, జాయింట్ సెక్రటరి డి.శ్యామ్ సన్,ట్రెజరర్ మంద గౌతమ్ కుమార్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## యేసు క్రీస్తు బోధనలు ఆదర్శనీయం..

### మానవాళికి క్రీస్తు శాంతి సందేశం స్ఫూర్తిదాయకం

### నీలం మధు ముదిరాజ్...

వికలాంగులకు నిత్యావసర సరుకులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన నీలం

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆదర్శనీయం, అనుసరణీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని చిట్కుల్ పరిధిలోని బ్యులా, ఎంవీ చర్చిలలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని కేక్ కట్ చేసి, ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి వికలాంగులకు నిత్యావసర సరుకులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడిగా ప్రజల మధ్యనే నడయాడి సమాజానికి శాంతి సందేశం అందించిన దయామయుడు యేసుక్రీస్తు అని కొనియాడారు.క్రీస్తు చూపిన శాంతి మార్గం సర్వ మానవాళికి స్ఫూర్తి దాయకమని, ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ ప్రతి ఒక్కరూ ప్రేమ, జాలి, దయా గుణాలు కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో బ్యూలా చర్చి నిర్వాహకులు ప్రకాష్ రావు, రాజ్యలక్ష్మి, ఎంవీ చర్చి నిర్వాహకులు శ్రీమాన్, వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకులు రవి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, రజక సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు గోపాల్, రాజ్ కుమార్, గౌరి శంకర్, అనిల్, నిర్వాహకులు, క్రైస్తవ నాయకులు, సోదర, సోదరీమణులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శాంతినగర్ బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నాచారం (వాయిస్ టుడే):శాంతినగర్ నార్త్ లాలగూడ లో గల బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ కే. సుమంత్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రైస్తవ సోదరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొని వేడుక జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేకును కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాప్టిస్ట్ చర్చ్ అధ్యక్షులు కే. సత్యానందం, కార్యదర్శి ఎ.ప్రేమ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బి పరంజ్యోతి, కోశాధికారి వై.నినివెంట్, సహాయ కార్యదర్శి జి. విద్యాసాగర్, జాయింట్ సెక్రెటరీ ఎస్. డేవిడ్, అసిస్టెంట్ కోశాధికారి జి. విద్యాసాగర్ తో పాటు పలువురు క్రిస్మస్ వేడుకలో పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



హైదరాబాద్, డిసెంబర్ 25 : అంతర్జాతీయ సేవా సంస్థ బ్లిస్‌బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హెూప్ ఆధ్వర్యంలో కార్పొరేట్ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ కార్పొరేట్ సంస్థల అధ్యక్షులు, ప్రతినిధులు హాజరై క్రిస్మస్ సందేశాన్ని పంచుకున్నారు. ప్రేమ, శాంతి, మానవ సేవ అనే క్రైస్తవ ధర్మ విలువలను ప్రతిబింబించేలా వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ సమాజంలో సోదరభావం, ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించే పండుగగా నిలుస్తుందని అన్నారు. మతాలకు అతీతంగా మానవత్వమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెనిసిస్ ఇన్ఫో ఎక్స్ వినయ్ సరికొండ, ప్రొఫెసర్ రాజేశ్వరి పాల్గొన్నారు.



## ఇందిరానగర్ శ్రీ సాయి గణేశ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

హైదరాబాద్, డిసెంబర్ 25: సభ్యుల ఆర్థిక అవసరాలకు సొసైటీ సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు న్యూ ఇందిరానగర్ శ్రీ సాయి గణేశ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్యక్షుడు క్యాసా రవికుమార్ తెలిపారు. న్యూ ఇందిరానగర్ శ్రీ సాయి గణేశ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్ గా భోగ స్వామి, వర్కింగ్ ప్రసిడెంట్ గా పాక స్వామి, ఆధ్యక్షుడిగా కె.రవికుమార్, ఉపాధ్యక్షులుగా మేకల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పి.రమేశ్, కోశాధికారిగా ఆంధ్రపు దేవరాజ్ తో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికున్నారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు క్యాసా రవికుమార్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టాల వినోద్ కుమార్ చారి, వెంకట్ రెడ్డి, నర్సింగ్ రావు (చారి), భోగ వెంకటయ్య, అంబాదాస్, సురేశ్, సుకేశ్, రాములు, కనకయ్య, నర్సింహ్మా, రిషి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమతత్వంతో విశ్వమానవాళి ప్రజల జీవితాలలో వెలుగులు పంచిన కరుణామయుడు యేసుక్రీస్తు

### పీసీసీ సభ్యులు టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



కూకట్‌పల్లి, డిసెంబర్ 25(వాయిస్ టుడే): లోకరక్షకుడు యేసుక్రీస్తు పుట్టినరోజు పురస్కరించుకుని బాలానగర్ లోని చర్చ్ అఫ్ క్రిస్ట్ లో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిధిగా పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరై చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం పాస్టర్ చిన్న రాజు మరియు స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి క్రైస్తవ సోదర, సోదరిమనులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బేగంపేట్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హస్సీ టోచర్ నివాసానికి వెల్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ పరమ పవిత్రమైన యేసు క్రీస్తు ఈ భూమిపై అవతరించిన రోజు క్రిస్టమస్ అని, సాటి మనిషి పట్ల ప్రేమ, దయ కలిగి నిస్వార్థంగా సేవ చేయడం, మనకు కీడు చేసిన వారినీ క్షమించే మహెూన్నత గుణం ఆయన జీవితం నుండి మనం నేర్చుకోవాల్సిన సత్యాలు అని అన్నారు. యేసు క్రీస్తు ఆశీస్సులు అందరిపైనా ఉంటూ ప్రపంచ శాంతి దూత అయినా జీసస్ విశ్వ మానవాళికి శ్రేయస్సుకు కృషి చేస్తారన్నారు. భారతదేశం భిన్న మతాల, కులాల, సమూహమని మన ఆచారాలను గౌరవిస్తూ, ఇతరుల ఆచారాలను గౌరవించడం మానవత్వమని అందరం కలసి మెలసి జీవించాలని ఒకరి కష్ట సుఖాలలో మరొకరు పాలుపంచుకోవాలని ప్రేమను పంచమని ఏసుక్రీస్తు మానవాళికి బోధించారని బైబిల్ ప్రపంచానికి శాంతి సందేశం అందిస్తుందన్నారు. సర్వమత ఐక్యతతో అందరం కలిసి మెలసి ముందుకు సాగాలని, మతసామరస్యమే మన బలం అన్నారు. క్షమాగుణం, శాంతి, కరుణ, సహనం, ప్రేమతో జీవించిన క్రీస్తు జీవనగమనం, నేటికీ అందరికీ ఆచరణీయ మన్నారు. అన్ని మతాల ఐక్యత, సామాజిక సౌహార్ధాన్ని పెంపొందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ప్రజలందరి శ్రేయస్సు, సమాన అభివృద్ధే మా ప్రజా ప్రభుత్వ నిరంతర సంకల్పం అన్నారు. క్రీస్తు చూపిన శాంతి మార్గంలో పయనిస్తూ, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆనందం, ఆరోగ్యం మరియు సుఖశాంతులతో వర్ధిల్లి, ఈ క్రిస్మస్ అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పులి శ్రీకాంత్ పటేల్, బేగంపేట్ రమేష్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, మాట్టే ప్రసన్న కుమార్, హేమంత్, మహేందర్, శేఖర్ గజానంద్, అరుణ్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, బాల, యువ నాయకులు భరత్, జెల్ల శివ, పర్వేజ్, భరత్ వంశీ, చంద్రకళ, క్రైస్తవ సోదర, సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు జాబ్ గ్యారెంటీతో ఉచిత స్కిల్ ట్రైనింగ్

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 25: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఎల్ ఎస్ సి (లాజిస్టిక్స్ స్కిల్ కౌన్సిల్) రీడింగ్ టన్ ఫౌండేషన్ (క్వాలిటీ) సహకారంతో జాబ్ గ్యారెంటీతో కూడిన ఉచిత స్కిల్ ట్రైనింగ్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా లాజిస్టిక్స్ రంగానికి చెందిన వివిధ విభాగాల్లో నైపుణ్య శిక్షణ అందించి, శిక్షణ పూర్తైన అనంతరం 100 శాతం ప్లేస్‌మెంట్‌తో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే 24-12-2025 న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఎంపిక డ్రైవ్‌లో 29 మంది అభ్యర్థులను



ఎంపిక చేయగా, మొత్తం 51 మంది యువతి, యువకులు శిక్షణకు హాజరయ్యారని తెలిపారు. మరింత మందికి అవకాశం కల్పించేందుకు డిసెంబర్ 27, 2025 న ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం లో మరో ప్రత్యేక ఎంపిక డ్రైవ్ నిర్వహించి అదనంగా 50 మంది యువతను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో వేర్‌హౌస్ స్టోర్ కీపర్, సప్లై చైన్ అసోసియేట్, ఎక్స్‌పోర్ట్%-%ఇంపోర్ట్ ఎగ్జిక్యూటివ్ వంటి కోర్సులు ఉండగా, 10వ తరగతి నుంచి గ్రాడ్యుయేషన్ అర్హత కలిగి 18 నుంచి 27 సంవత్సరాల వయస్సు ఉన్న యువతి, యువకులు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం నెలకు 13,000 నుంచి 18,000 వరకు జీతంతో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితమై స్కిల్ ఇండియా సర్టిఫికేషన్ కలిగి ఉండటంతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు కూడా ఉంటాయని, జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.




## టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు, రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశాలను విజయవంతం చేయండి

### టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 25 : రాజన్న సిరిసిల్ల జిల్లా లో డిసెంబర్ 28, 29 రెండు రోజుల పాటు జనగామ లో జరిగే టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశాలు, రాష్ట్ర విద్యా సదస్సును విజయవంతం చేయాలని టిఎస్ యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి జంగిటి రాజు కోరారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లో సంఘ నాయకులతో కలిసి రాష్ట్ర విద్యా సదస్సు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశాలలో ఉపాధ్యాయులు, టిఎస్ యూటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని, మొదటి రోజు ప్రారంభ సభలో ముఖ్య అతిధులు గా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, కొండ సురేఖ లు పాల్గొంటారని, రెండో రోజు విద్యా సదస్సు నందు ప్రొఫెసర్ కె నాగేశ్వర్, ఆర్టిఐ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, మాజీ ఎంఎల్సి అలుగుబెల్లి నర్సిరెడ్డి మొదలగు వారు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశాలలో వివిధ విద్యా రంగ సమస్యల పై విస్తృత స్థాయిలో చర్చలు జరిపి , తీర్మానాలు చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో టిఎస్ యూటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండమనేని మహేందర్ రావు, కోశాధికారి అంబటి రమేష్ ,జిల్లా కార్యదర్శులు కొత్వాల్ ప్రవీణ్, కోటగిరి లక్ష్మణ్, తిరుపతి జాదవ్, గాలిపెల్లి సంతోష్, ఎంఎస్ టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బెజగం సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జహీరాబాద్ మాజీ మంత్రి వర్యులు, ఇన్‌చార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్

ఝరాసంగం సంగారెడ్డి జిల్లా డిసెంబర్ 25: జహీరాబాద్ పట్టణంలోని మెథడిస్ట్ సెంట్రల్ చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వర్యులు, జహీరాబాద్ ఇన్‌చార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్. ఆయన సతీమణి ప్రమీల. పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు మరియు సోదరిమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని మతాల మధ్య ఐక్యత, సమైక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చర్చ్ పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మందమర్రిలో సీసీ రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం



మందమర్రి డిసెంబర్ 25 (వాయిస్ టుడే): కార్మిక, ఉపాధి,గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి గురువారం మందమర్రి పట్టణంలో సీసీ రోడ్డుల అభివృద్ధి పనులు ప్రారంభించారు. భగత్ సింగ్ నగర్ నుంచి శ్రీపతినగర్ వరకు కొత్త సీసీ రోడ్డును నిర్మించనున్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఇతర అధికారులు పాల్గొని భూమి పూజ నిర్వహించారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత పట్టణంలో రవాణా సౌకర్యం మెరుగుపడి, స్థానిక ప్రజలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుంది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో మందమర్రిలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు నిర్లక్ష్యం చేయబడ్డాయని, ఎన్నికల తర్వాత మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 70% పనులు పూర్తయ్యాయని చెప్పారు. పట్టణ, గ్రామ ప్రాంతాల తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## ఝరాసంగం 8వ వార్డులో బోరు తవ్వకం ప్రారంభం

### పంచాయతీ ఎన్నికల హామీ నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ

ఝరాసంగం సంగారెడ్డి జిల్లా డిసెంబర్ 25 : ఝరాసంగం లో పంచాయతీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఝరాసంగం మండలంలోని ఎనిమిదో వార్డులో త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు బావి తవ్వక పనులు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్ ఆధ్వర్యంలో కాలనీ ప్రజల సహకారంతో ఈ బోరు ఏర్పాటు చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బోరు తవ్వక పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్ పాటిల్, చంద్రప్ప, పెంటయ్య, సంగమేశ్వర్, ఆనందం, రాజ్ కుమార్, నాగప్ప, తుకారం, ఇస్మాయిల్, అనిల్ కుమార్, సాయిలు, నర్సింలు, లక్ష్మయ్య, సంగన్న, ఫక్రుద్దీన్, కృష్ణ, దత్తు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# బుద్ధవనం సందర్శించిన న్యాయమూర్తులు



నాగార్జునసాగర్, డిసెంబర్, 25: వాయిస్ టుడే ప్రతినిధి : తెలంగాణ టూరిజం ఎంతో ప్రతిష్టాత్మకంగా నాగార్జునసాగర్ లో నిర్మించిన బుద్ధవనాన్ని గురువారం నాడు పలువురు ప్రముఖులు సందర్శించారు. వీరితో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు మహాస్తూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులను వెలిగించిన అనంతరం బుద్ధవనం కండువాలతో, బుద్ధవనం బ్రోచర్లతో సత్కరించారు. అనంతరం వీరు మహా స్తూపం సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను,వివరాలను తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించారు. అనంతరం వీరు బుద్ధవనం లోని బుద్ధ చరిత వనం, జాతకవనం, ధ్యానవనం, స్తూప వనాలను సందర్శించారు. గురువారం బుద్ధవనం సందర్శించిన వారిలో నాంపల్లి కోర్టు సీనియర్ సివిల్ న్యాయమూర్తి డాక్టర్ సిహెచ్ సంపత్, ఉప్పల్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయమూర్తి కే.శ్రీకాంత్, నల్లగొండ జిల్లా చందంపేట మండల తాసిల్దార్ డి శ్రీధర్ బాబు తదితరులు కుటుంబ సభ్యులతో సందర్శించారు.వీరితోపాటు రెవెన్యూ ప్రోటోకాల్ ఆఫీసర్ దండ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.





## క్రీస్తు భోధనలే ప్రపంచానికి మార్గదర్శకం

### టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్

కూకట్ పల్లి, డిసెంబర్ 25(వాయిస్ టుడే): ప్రపంచానికి శాంతి సందేశాన్ని పంచిన ఏసుక్రీస్తు సదాస్మరణీయుడని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కెపిహెచ్బి కాలనీ రోడ్డు నెంబర్ వన్ లో ఉన్న లూథరన్ చర్చిలో మేకల మైఖేల్ ఆధ్వర్యంలో మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హస్సి టోచర్ నివాసంలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రీస్తు భక్తులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు గొట్టిముక్కల జశ్వంత్ రావు, కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంధం రాజు, సోషల్ మీడియా పిడికిడి గోపాల్ చౌదరి, వనజ, రేష్మ మరియు బేగంపేట్ డివిజన్ అధ్యక్షులు రమేష్, మరియు ఏ బ్లాక్ అధ్యక్షురాలు రమాదేవి, మరియు మైనారిటీ నాయకులు పర్వేజ్ మరియు ఆలీ, మార్కెటింగ్ డైరెక్టర్ అరుణ్, యూత్ నాయకులు భారత్, నర్సింగ్ ,బాలు డివిజన్ సీనియర్ నాయకులు, అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అటల్ జీ ఆశయ సాధనల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మహానేత

### మూసాపేట్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్

కూకట్‌పల్లి, డిసెంబర్ 25(వాయిస్ టుడే): భారత మాజీ ప్రధానమంత్రి, ఆజన్మంతం తన జీవితాన్ని దేశసేవకే అంకితం చేసిన మహా నేత, బీజేపీ కార్యకర్తల నియమనిష్ఠలకు రూపకర్త అటల్ బిహారి వాజ్ పేయి శత జయంతి సందర్భంగా బీజేపీ మూసాపేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి రవి గౌడ్ ఆధ్వర్యంలో చిత్తరమ్మా దేవాలయ సమీపంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ కార్పొరేటర్ కొడి చర్ల మహేందర్ పాల్గొని అటల్ జీ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం డివిజన్ పరిధిలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ, గ్రామీణ సడక్ యోజన, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, జాతీయ రహదారుల అభివృద్ధి వంటి అనేక ప్రజోపయోగ పథకాలకు రూపకల్పన చేసిన దూరదృష్టి గల నాయకుడు అటల్ జీ అని కొనియాడారు, అటల్ జీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు కార్గిల్ యుద్ధ సమయంలో కావచ్చు ప్రపంచ దేశాల దౌత్య నిర్ణయాలలో కావచ్చు పూర్తి స్వేచ్ఛను సంబంధిత శాఖలకు ఇచ్చిన తీరును మరువలేనిదని అదే తరహాలో నేటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వారి ఆశయ సాధనల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వినర్ శ్రీకర్ రావు, రాష్ట్ర డేటా సెల్ నాయకురాలు విజయ్ భవాని, సీనియర్ నాయకులు తూము శైలేష్, ఐలయ్య , భూమండ్ల జీవన్, పొలాకి కిషోర్, మన్నే యాదగిరి, తిరుపతి రెడ్డి, శేష మట్టం నవీన్, ప్రశాంత్ రెడ్డి , కృష్ణ యాదవ్, అభిలాష్, డి. శ్రీనివాస్, గుడికాడి శ్రీనివాస్ గౌడ్, కార్తీక్, నవీన్ గౌడ్, సదానంద్, భాస్కర్, సతీష్ చారి, పండిత్ రాజేందర్, బి. సాయి, మైసయ్య, యోగేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## జియాన్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

రామకృష్ణాపూర్ డిసెంబర్ 25 (వాయిస్ టుడే): రామకృష్ణాపూర్ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల జియాన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. లోక రక్షకుడు యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని, స్థానిక క్రైస్తవులు భక్తిశ్రద్ధతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. చర్చ్ సెక్రటరీ దేవయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలను రంగురంగుల విద్యుత్ దీపాలు, నక్షత్రాలతో అలంకరించి ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో చర్చికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చ్ పాస్టర్ రవి రఘుయేలు యేసుక్రీస్తు ప్రేమ, కరుణ, శాంతి మార్గంలో నడవాలని ఆకాంక్షిస్తూ, దేవుని కృప అందరిపై ఉండాలని ప్రార్థించారు.

ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. యువతీ,యువకులు, చిన్నారులు ఆలపించిన కీర్తనలు, యేసుక్రీస్తు జీవితాన్ని ప్రతిబింబించే నాటిక, నృత్య ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్ధులుగా చేసింది. కార్యక్రమాంతరంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో చర్చ్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, కోశాధికారి మిట్టపల్లి సంతోష్ కుమార్, కమిటీ సభ్యులు రసపల్లి కరుణాకర్, గోద దావీదు, ఊట్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 25: క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు, క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఇల్లందు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సోదర సోదరీమణులకు ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసన సభ్యురాలు భానోత్ హరిప్రియ నాయక్ కిస్మిస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దయామయుడు గాను కరుణామయుడు గాను ఆరాధన అందుకునే గొప్ప దైవం క్రీస్తు యేసు అని ఏసుక్రీస్తు పుట్టిన రోజునే ప్రపంచవ్యాప్తంగా క్రిస్టమస్ పండుగ జరుపుకొని ఎంతో పవిత్రంగా భావిస్తారని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ అన్నారు. క్రీస్తు యేసు చూపిన మార్గంలో పయనించే ప్రేమ కరుణ త్యాగం శాంతి వంటి లక్షణాలను అలవర్చుకొని సన్మార్గంలో పయనించాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ కోరారు

# ఘనంగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి జయంతి వేడుకలు

జమ్మికుంట డిసెంబర్ 25 (వాయిస్ టుడే): బిజెపి జమ్మికుంట పట్టణ శాఖ ఆధ్వర్యంలో భారతరత్న మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్పేయి జయంతి వేడుకలు గాంధీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించి, వాజపేయి చిత్రపటానికి నివాళులు అర్పించి, కేక్ కట్ చేసి స్వీట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొలకాని రాజు, ఆకుల రాజేందర్ లు మాట్లాడుతూ వాజపేయి గొప్ప కవిగా, దేశభక్తుడిగా, దేశం కోసం అహర్నిశలు శ్రమించి దేశం కోసం సేవ చేసిన మహనీయులు, రాజకీయ నాయకులలో అజాత శత్రువు గా పేరుగాంచిన అటల్ జీ అని కొనియాడారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయని, పార్టీలు ఏర్పడతాయి, కనుమరుగవుతాయి కానీ దేశం మాత్రం శాశ్వతంగా ఉంటుందని అటల్ జీ అన్నారని గుర్తు చేశారు. అణు పరీక్షలు చేయొద్దని అమెరికా లాంటి దేశాలు హెచ్చరించిన అణు పరీక్షలు చేసి దేశ సత్తాని ప్రపంచ దేశాలకు చూపించారని, పాకిస్థాన్ పై 1999లో కార్గిల్ యుద్ధంలో వాజపేయి హయాంలో గెలిచామని, భావితరాలకు అటల్ జీ జీవితం స్ఫూర్తి అని కొనియాడారు, భారతరత్న అటల్ బీహారి వాజ్పేయి జయంతి రోజున సుపరిపాలన దినోత్సవం కేంద్రప్రభుత్వం ప్రకటించిందన్నారు. అటల్ జి ఆశయాలను ప్రతి ఒక్కరూ




కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, కైలాసకోటి గణేష్, రాజేష్ ఠాకుర్, మాచనపల్లి ఉపసర్పంచ్ రమేష్ యాదవ్, బచ్చు శివకుమార్, ఇటుకాల స్వరూప, గంగాభవాని, బూరుగుపల్లి రాము, తూడి రవిచందర్, వేముల జగన్, ఉడుగుల మహేందర్, కురిమిళ్ళ అశోక్, రామస్వామి, ముకుందా సుధాకర్, యాంసాని సమ్మయ్య, మురికి మహేష్, బొజ్జ శరత్, నాగపూరి విజయ్, దొడ్డే వేణు, ముదాం సురేష్, సిరియాల విజయ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మర్యాద భేటీలను రాజకీయం చేయడం సరికాదు

### సర్పంచ్ నిర్ణయాన్ని వక్రీకరించిన ప్రచారం



చిగురుమామిడి, డిసెంబరు 25 (వాయిస్ టుడే): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కొంకట మౌనికపై ఇటీవల వెలువడిన కొన్ని కథనాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాసేవ లక్ష్యంగా తీసుకున్న ఆమె చర్యలను రాజకీయ రంగు పులుముతూ అనవసర చర్చలకు దారి తీసేలా ప్రచారం చేయడం తగదని గ్రామస్తులు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో సర్పంచ్గా గెలుపొందిన మౌనిక, బుధవారం ఉదయం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్కుమార్ను మర్యాదపూర్వకంగా కలవడం సాధారణ రాజకీయ సంస్కృతిలో భాగమేనని స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా సాయంత్రం కరీంనగర్లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ను కూడా మర్యాదపూర్వకంగా తన భర్త చక్రధర్ రాజుతో కలవడం జరిగిందన్నారు. ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు గ్రామ అభివృద్ధి మరియు గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం వివిధ పార్టీల నాయకులను కలవడం అనేది సంప్రదాయంగా కొనసాగుతున్న అంశమే తప్ప, దానిని వక్రీకరించడం సరికాదని సర్పంచ్ కొంకట మౌనిక పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఒక్కొక్కరి రాజకీయ అభిరుచులు ఒక్కో లాగా ఉంటుందన్న విషయం మరచిపోవద్దని ఆమె సన్నిహిత వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. "ఉదయం ఒక పార్టీలో, సాయంత్రం మరో పార్టీలో" అన్న శీర్షికలతో ప్రచారం చేయడం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి మౌనిక చేసినది మర్యాదపూర్వక భేటీయే తప్ప మరొకటిగా భావించకూడదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలన్న ఉద్దేశంతోనే తాను ముందుకు సాగుతున్నానని మౌనిక స్పష్టం చేసినట్లు సమాచారం. వ్యక్తిగత రాజకీయ ప్రయాణాన్ని సంచలనంగా చిత్రీకరించడం కంటే, ప్రజాప్రతినిధిగా ఆమె చేసే పనితీరును ఆధారంగా చేసుకొని అంచనా వేయాలని పలువురు సూచిస్తున్నారు.

## అప్పుల బాధతో ఆశా కార్యకర్త ఆత్మహత్య



ములుగు: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆశా కార్యకర్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు మర్కుక్ ఎస్సై దామోదర్ తెలిపారు. మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన బెల్దే పద్మ, నాగరాజు దంపతులకు ఇద్దరు కుమారులు. వారికి వివాహం జరగడంతో ప్రస్తుతం హైదరాబాదులో ఉంటున్నారు. పద్మ(55) గ్రామంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తుంది. కొడుకుల వివాహానికి, కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురైంది. గురువారం ఉదయం గ్రామానికి సమీపంలో ఉన్న చెరువు వద్దకు నడుచుకుంటూ వెళ్లి నీటిలో దూకింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ వ్యక్తి గమనించి గ్రామస్థులకు సమాచారం అందించగా.. వారు అక్కడికి చేరుకొని నీటిలోంచి ఆమెను తీసేలోపు మృతి చెందింది. మృతురాలి భర్త నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్షల అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించామన్నారు.



## ముక్కోటి ఏకాదశికి ముస్తాబవుతున్న సుందరగిరి వెంకటేశ్వర స్వామి ఆలయం

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో వెలసిన సుప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులతో కళకళలాడేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 30న జరగనున్న ఉత్తర ద్వార దర్శనం, ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఆలయ ప్రాంగణం అంగరంగ వైభవంగా ముస్తాబవుతోంది.

ప్రతి ఏటా వేలాదిగా భక్తులు తరలివచ్చే ఈ మహోత్సవానికి సంబంధించి ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు, ప్రసాద వితరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కొండపర్తిరాజు కుమార్, ఆలయ చైర్మన్ చొల్లేటి శంకరయ్యలు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం విశేష ఫలదాయకమని భావించే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని వారు తెలిపారు. సుందరగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలవనున్నాయని, భక్తుల సమక్షంలో స్వామివారి దర్శనం అత్యంత భక్తిశ్రద్ధలతో జరగనుందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పూల లచ్చిరెడ్డి, శేషం నరసింహచార్యులు, గందె రాజయ్య, ఎనగందుల శారద, అర్చకులు శేషం శ్రీనివాసాచార్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బూట్ల కవిత ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల్లో ఉద్యోగాలంటూ మోసం..

రఘునాథపాలెం: దేవాలయాల్లో ఉద్యోగాలంటూ రూ.3 లక్షలు చొప్పున తీసుకుని ఐదుగురు యువకులను మోసం చేసిన ఘటన హర్యాతండాలో వెలుగుచూసింది. బాధితులైన మాలోతు నరేశ్, విష్ణు, ఆనంద్, శ్రీను, లోకేశ్ల కథనం ప్రకారం... పెద్దపల్లికి చెందిన ఓ వ్యక్తి బాధితుల్లో శ్రీనుకు పరిచయమయ్యాడు. తాను సేవా సమితి నిర్వహిస్తున్నానని, దేవాలయాల్లో హుండీ లెక్కింపు ఉద్యోగాలున్నాయని అతను శ్రీనును నమ్మించాడు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లోని దేవాలయాల్లో ఉద్యోగం వస్తుందని, నెలకు రూ.30వేల వేతనం, ఇతర సౌకర్యాలు, ఉద్యోగ విరమణ తదుపరి పింఛను సౌకర్యం ఉంటాయని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మి శ్రీను, అతని స్నేహితులు ఒక్కొక్కరు రూ.3లక్షల చొప్పున మొత్తం రూ.15లక్షల నగదు ఆరు నెలల క్రితం చెల్లించారు. దీంతో వారికి జాయినింగ్ ఆర్డర్లు, బాండ్ పేపర్లు అంటూ కొన్ని పత్రాలు ఇచ్చాడు. వారిని శ్రీకాళహస్తి, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో హుండీ లెక్కింపు పనులు చేయించాడు. ఐదు నెలలు పని చేసినా వేతనాలు అందకపోవడంతో యువకులు అతణ్ని నిలదీశారు. మాట దాటవేస్తూ వచ్చిన అతను ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. ఇటీవల శ్రీకాళహస్తి పిలిచి హుండీ లెక్కింపు చేయించిన అతను డబ్బులు సెటిల్ చేస్తానని పంపించాడు. ఆ తర్వాత ఫోన్ చేసినా స్పందించకపోగా, 'మీ ఇష్టం వచ్చింది చేసుకోండి' అంటూ బెదిరిస్తున్నాడని బాధితులు వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు. పోలీసులను వివరణ కోరగా దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

# కన్న కూతుర్ని కడతేరిచిన కసాయి తల్లిదండ్రులు

### పోలీసుల విచారణలో సంచలన విషయాలు



సైదాపూర్ డిసెంబరు 25 (వాయిస్ టుడే) కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట గ్రామంలో నవంబర్ 15 న ఇంటర్ విద్యార్థిని రెడ్డి అర్చన (16)పురుగుల మందు తాగి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన తెలిసిందే. కాగా, మృతురాలు అర్చన తండ్రి రెడ్డి రాజు తన కూతురు కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తన కూతురి మృతి పట్ల ఎవరిపై అనుమానం లేదని సైదాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అది ఆత్మహత్య కాదు హత్య అని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది సైదాపూర్ పోలీస్ స్టేషన్ లో గురువారం ఏసిపి మాధవి హత్య వివరాలు వెల్లడించారు. మృతురాలు రెడ్డి అర్చనకు అదే గ్రామానికి చెందిన ఫోను అనిల్ అనే వ్యక్తితో ప్రేమ వ్యవహారం గమనించిన కుటుంబ సభ్యులు కుటుంబ పరువు పోతుందని ముందస్తు ప్రణాళిక ప్రకారం అర్చన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మృతురాలు తండ్రి రాజు, తల్లి లావణ్య ఇంట్లో ఉన్న పురుగుల మందును బలవంతంగా తాగించి గొంతు పిసికి హత్య చేసినట్లు తెలిపారు అనంతరం సంఘటనను తప్పుడు ఫిర్యాదు చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు చేశారు అన్నారు. నిందితులు పోలీసుల విచారణలో నేరం ఒప్పుకోవడంతో అర్చన తల్లిదండ్రులపై మర్డర్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితులను న్యాయస్థానంలో హాజరు పరిచే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హుజరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ గౌడ్, సైదాపూర్ ఎస్ఐ తిరుపతి ఉన్నారు.



## సర్పంచ్ నల్ల మోహన్‌ను బోయినపల్లి రజక సంఘం సభ్యులు, చాలెంజ్ యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు



బోయినపల్లి (వాయిస్ టుడే ప్రతినిధి) డిసెంబర్ 25: బోయినపల్లి సర్పంచ్ గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నల్ల మోహన్ ను బోయినపల్లి రజక సంఘం సభ్యులు ,చాలెంజ్ యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులను శాలువాతో సన్మానించారు.అలాగే గర్షకుర్తి మాజీ సర్పంచ్ కంఠం రాజమల్లు సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ వార్డు సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి రజక సంఘం అధ్యక్షులతో పాటు సంఘ సభ్యులు,చాలెంజ్ యూత్ సభ్యులు ఉన్నారు

## విలాసాగర్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

### పాల్గొన్న సర్పంచ్ ఏనుగుల కనకయ్య



బోయినపల్లి డిసెంబర్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి): బోయినపల్లి మండలం విలాసాగర్ చర్చిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ ఏనుగుల కనకయ్య ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపిన గొప్ప వ్యక్తి యేసు ప్రభువు.. యేసు ప్రభువు వాక్యలను పాటించడం ద్వారా ప్రపంచ శాంతి నెలకొంటుంది అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ వేడుకల సందర్భంగా చర్చి ల సుందరీకరణ కోసం నిధులు మంజూరు చేయటం జరిగిందనీ అన్నారు.



## శ్రీ పోచమ్మ ఆలయానికి గోడ గడియారం అందజేసిన భక్తుడు

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి డిసెంబర్ 25 బోయినపల్లి ..మండలం తడగొండ గ్రామంలోని శ్రీ పోచమ్మ తల్లి ఆలయనికి గురువారం రోజు గోడ గడియారాన్ని అందజేసిన ఎడపల్లి శ్రీనివాస్. అతనికి గ్రామ దేవత అమ్మవారి ఆశీస్సులు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు ఎల్లవేళలా ఉండాలని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి లచ్చయ్య, మినుకుల శ్రీనివాస్, గుడి రవీందర్ రెడ్డి, దూస నారాయణ తదితరులున్నారు.

## భాజపా నాయకుల బాహాబాహీ



నీలగిరి: భాజపాలో అంతర్గత తగాదాలు తారాస్థాయికి చేరాయి. సర్పంచుల సన్మాన కార్యక్రమం వాయిదా పడటంతో భాజపా నేతలు గురువారం బాహాబాహీకి దిగారు. పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు యాదవ్‌లు పరస్పరం దాడులు చేసుకున్న సంఘటన చర్చనీయాశంగా మారింది. పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులను, వార్డు సభ్యులను మాజీ ప్రధాని వాజ్‌పేయీ జయంతి సందర్భంగా సన్మానించాలని నిర్ణయించారు. రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సమయం ఇవ్వక పోవడంతో సన్మాన కార్యక్రమాన్ని వాయిదా వేశారు. కొందరికి సమాచారం అందక పార్టీ కార్యాలయానికి గురువారం రాగా వారిని సన్మానిద్దామని వర్షిత్‌రెడ్డి అన్నారు. దీనిపై రామరాజు స్పందించి రాష్ట్ర అధ్యక్షుడు వచ్చిన రోజున సన్మానం చేద్దామని సూచించారు. రామరాజు సూచన నచ్చని వర్షిత్‌రెడ్డి ఆయన్ని దూషించడం వల్లే గొడవ మొదలైనట్లు చెబుతున్నారు. వర్షిత్‌రెడ్డి తిట్టుకుంటూ రామరాజు సమీపానికి రావడం.. భాజపా జిల్లా ఉపాధ్యక్షులు పక్కీర్ మోహన్‌రెడ్డి రామరాజుపై చేయి చేసుకోవడంతో ఘర్షణ తీవ్ర రూపం దాల్చిందని పలువురు తెలిపారు. ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకోవడంతో పార్టీ నాయకులు వారించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సి వారు ఇలా వ్యవహరించడం బాధగా ఉందని సీనియర్ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి వాపోయారు.

భాజపా కార్యాలయంలో నాయకుల మధ్య జరుగుతున్న ఘర్షణను చిత్రీకరించిన మీడియా ప్రతినిధుల కెమెరాలను వర్షిత్‌రెడ్డి లాక్కుని మెమోరీకార్డులో ఫొటోలు తొలగించారు. అగ్రహించిన మీడియా ప్రతినిధులు కార్యాలయం ప్రధాన గేటు ముందు నిరసనకు దిగారు. ఎట్టకేలకు క్షమాపణ చెప్పడంతో ఆందోళన విరమించారు.